సురక్షతో సత్వరమే ధ్రువీకరణ పత్రాలు



కైకలూరు సచివాలయంలో ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్ తదితరులు

ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా త్వరితగతిన ధ్రువపత్రాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ జయమంగళ వెంటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కైకలూరు సచివాలయం-1, కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారం, ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ కైకలూరు సచివాలయం-1 పరిధిలో రూ.11,70,02,973 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాలు అందించామన్నారు. సురక్ష కార్యక్రమం ద్వారా 287 ధ్రువపత్రాలను ఎటువంటి ఫీజు లేకుండా పంపిణీ చేశామన్నారు. జగనన్న గ్రీన్ విలేజ్‌లో గృహాలకు ఉచిత విద్యుత్, తాగునీరు అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే సచివాలయ వ్యవస్థ చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. వలంటీర్ల వ్యవస్థపై విమర్శలు చేయడం తగదన్నారు. గత పాలనలో మండల కేంద్రాల చుట్టూ ప్రజలు తిరిగేవారన్నారు. నేడు 11 రకాల ధ్రువపత్రాలను ఇంటి వద్దనే అందిస్తున్నారని తెలిపారు. సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. ఎంపీపీలు అడవి కృష్ణ, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, సర్పంచ్‌లు దానం మేరీ నవరత్నకుమారి, సుదాబత్తుల లక్ష్మీపద్మావతి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తిరుమాని రమేష్, భట్రాజు శివాజీ, మోట్రూ ఏసుబాబు, వైస్ ఎంపీపీలు మహమ్మద్ జహీర్, కట్టా నాగలక్ష్మి, రాచూరి రాధా, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవి, ఎంపీటీసీలు లక్ష్మీకుమారి, మూడెడ్ల శశికళ, తహసీల్దార్లు బి.మురళీకృష్ణ, వంశీ, ఎంపీడీవో రాంబాబు, కార్యదర్శి శివన్నారాయణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు .

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ముదినేపల్లి మండలం వాడవల్లిలో రూ.82.60 లక్షల నిధులతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభించారు. కార్యాలయాల నిర్మాణాలకు స్థలాన్ని వితరణగా అందించిన ఉద్దగిరి కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మండవల్లి: ప్రజలందరికీ న్యాయం చేయటమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. మండలంలోని పెరికెగూడెంలో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వజన రంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోపెట్టాలని కోరారు. దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసి మొక్క నాటారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, ఎంపీటీసీ పెరుమాళ్ల లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి యేసోబురాజు, జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు పెరుమాళ్ల రామకృష్ణ, కొర్లపాడు సర్పంచ్ యడాలి నాగేశ్వరరావు, బావిశెట్టి స్వామి, మెండా సురేష్, బొబ్బిలి రత్తయ్యనాయుడు, చావలిపాడు శ్రీను, పెరుమాళ్ల కొండారెడ్డి, పెరుమాళ్ల పెద వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: జగనన్న సురక్ష నిరుపేదలకు వరమని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. మండలంలోని బొమ్ములూరు సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 464 మందికి ధ్రువీకరణ పత్రాలను ఎంపీపీ, జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, తహసీల్దార్ ఆంజనేయులు చేతుల మీదుగా అందజేశారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ కారే జోసఫ్, ఎంపీడీవో వెంకటరమణ, గ్రామ ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ అట్లూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్‌నాయకులు గుత్తా నాని, గద్దే రాము, కర్రే నాని, మాజీ ఎంపీపీ బోయిన కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

కాజ(మొవ్వ): మండలంలోని కాజ-2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు 410 మందికి పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో పెద్దారాయుడు తోట సర్పంచి తాతా స్వప్న, కాజ సర్పంచి కొడాలి భవానిలు ఎంపీటీసీ పేకేటి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, మండల సచివాలయాల కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: స్థానిక పామర్రు సచివాలయం-5లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి మాట్లాడుతూ 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు దరఖాస్తు చేసుకున్న వెంటనే పత్రాలను అందజేస్తున్నామని అన్నారు. వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ కె.కస్తూరి, డి.బాల వెంకటేశ్వరరెడ్డి, వార్డుమెంబర్ కూసం సుబ్బారెడ్డి, గ్రామ కార్యదర్శి సలీం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



బొమ్ములూరులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

చినపారుపూడి(పెదపారుపూడి): మండలంలోని చినపారుపూడి గ్రామంలో శనివారం సాయంత్రం జగనన్న సురక్ష కింద లబ్ధిదారులకు పత్రాలను ఎంపీపీ చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోగం సురేష్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు సమస్యగా ఉన్న పత్రాలను అర్హులకు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి ఎంఎస్ఏ దివాకర్, ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి సర్పంచ్‌లు నగుళ్ళ శ్రీనివాసరావు, వెల్లంకి సరళాదేవి, మండల సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం పట్టణంలోని బేతవోలులోని 27వ వార్డు, దేవరపేటలోని 10వ వార్డులో జరిగింది. బేతవోలు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ జగనన్న సురక్ష వలన లబ్ధిదారులకు చేకూరే ఫలాలను వివరించారు. ఈ సందర్భంగా ఒకరికి ఇంటి పట్టా, 559 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహారావు, వార్డు కన్వీనర్ రమణప్రసాద్, మాజీ కౌన్సిలర్ బెజవాడ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక 10వ వార్డులో అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వై.రాంబాబు పాల్గొన్నారు. ఒకరికి ఇంటిపట్టా, 545 మందికి వివిధ రకాల ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, సచివాలయాల కన్వీనర్ దుడ్డు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: జగనన్న సురక్ష సభను శనివారం శేరీకల్వపూడి గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ పథకం ద్వారా ప్రజలకు 188 ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తానా, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, డీటీ బి.కనకదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కోగంటి ధనుంజయ, వైఎస్సార్ సీపీ మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కొత్తూరి లక్ష్మీనారాయణ, సర్పంచులు కొత్తూరి వెంకటలక్ష్మి, అడుసుమిల్లి సత్యనారాయణ, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కార దిశగా పాలన

- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- కాజ సచివాలయం-1లో గడప గడపకు మన ప్రభుత్వం



కాజలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

కాజ(మొవ్వ): నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజారంజిక ప్రభుత్వం అమలులో ఉందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. శనివారం మొవ్వ మండలం కాజ గ్రామంలోని సచివాలయం -1 గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కైలే అనిల్ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికై అధికారులకు సూచనలిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ వలంటరీలు, సచివాలయ సిబ్బంది ప్రజలకు మరింత చేరువై ప్రజా సమస్యలను తమ సమస్యలుగా భావించి సత్వర పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సర్పంచ్ కొడాలి భవాని, ఎంపీటీసీ పేకేటి వెంకట లక్ష్మి, ఉప సర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయులు, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ జోగి రామచంద్రరావు, మర్రిరెడ్డి బాబ్జిరెడ్డి, నాయకులు పేకేటి సీతారామిరెడ్డి, వేల్పూరి వెంకయ్య, కొడాలి నాగరాజు, రాయవరపు రాజేష్, పంచాయతీ పాలక మండలి సభ్యులు, పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎంఈవోగా రామారావు బాధ్యతల స్వీకరణ



మండవల్లి: మండల విద్యాశాఖ అధికారిగా డి రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ-1గా బాధ్యతలు ఆయన బాధ్యతలు స్వీకరించినట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వాహనాల్లో పరిమితికి మించి ఎక్కొద్దు



గుడివాడరూరల్: ప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎల్ఎస్ఎన్ మూర్తి అన్నారు. జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాల నివారణపై మల్లాయపాలెం సమీపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ పరిధిలోని ముదినేపల్లి జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఎస్ఐ పోలీస్ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుపై వెళ్లే వాహన దారులకు ప్రమాదాల నివారణపై సూచనలు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో అధిక సంఖ్యలో కూలీలను తరలిస్తున్న వాహనాలను ఆపి ప్రయాణీకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చార్జీలు కలిసి వస్తాయని ఎక్కువ మంది వాహనంలో ఎక్కితే ప్రమాదాలు జరిగితే నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మూర్తి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల పంపిణీ

గుడివాడ టౌన్: విద్యార్థి దశలో సమయం చాలా విలువైనదని ఐఎఫ్ఎస్ అధికారి కె.భస్మాకరరావు అన్నారు. స్థానిక గౌరీశంకరపురంలోని డీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యూత్ స్కిల్ డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయ యూత్ స్కిల్ డే సందర్భంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దశలో కాలాన్ని సద్వినియోగం చేసుకున్న వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థగా నిర్వహిస్తున్న డీపీ ఫౌండేషన్ విద్యార్థులకు చక్కని నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తుందని వాటిని వినియోగించుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. ఫౌండేషన్ మేనేజర్ గద్దం భాను తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి మార్గాలపై అవగాహన

గుడివాడ టౌన్: పారుపూడి మండలం వానపాములలోని వైజ్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు శనివారం కెరీర్ కౌన్సెలింగ్ (జీవనోపాధి మార్గాలపై అవగాహన) నిర్వహించారు. 6 నుంచి 12 తరగతులకు చెందిన విద్యార్థులకు స్వీయ మద్దతుతో కూడిన జీవితాన్ని ఎలా గడపాలి అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక కెరీర్ కౌన్సిలర్, క్లినికల్ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సండ్రా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తులు, నైపుణ్యాలు, వ్యక్తిత్వం, విలువలు వంటి అంశాల ఆధారంగా కెరీర్‌ను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వభారతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ కొడాలి సునీత, డైరెక్టర్ ఆర్.ప్రణీత్, వైజ్‌వుడ్ డైరెక్టర్ ఆర్.మంజుల, వైస్ ప్రిన్సిపాల్ జి.కృష్ణారెడ్డి, ఎల్.హరిబాబు, ఎ.శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వగట్టుకు మరమ్మతులు

గుడ్లవల్లేరు: చినగొన్నూరులో సీబీ కెనాల్ గట్టు బలహీనంగా ఉండటంతో శనివారం ఇరిగేషన్ ఏఈ సిద్ధార్థ ఆధ్వర్యంలో కాల్వ గట్టును బలపరిచారు. ఈ కాల్వ గట్టు బలహీనత వలన 150 ఎకరాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉండటంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు ఏఈ పేర్కొన్నారు. సర్పంచి కోటప్రోలు నాగు, ఉప సర్పంచి శ్రీనివాసరరావు ఉన్నారు.

బియ్యం, కందిపప్పు సరఫరా కౌంటర్ ప్రారంభం



పామర్రు: బహిరంగ మార్కెట్‌లో ధరల కన్నా తక్కువ ధరకు రైతు బజారులో పలు రకాల నిత్యావసర వస్తువులను అందజేస్తున్నామని కృష్ణా జిల్లా సివిల్ సప్లై అధికారి వి. పార్వతి అన్నారు. స్థానిక రైతు బజారులో ప్రత్యేక కౌంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పామర్రు హోల్‌సేల్ రైస్ మర్చంట్స్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కౌంటర్ ద్వారా సోనా మసూరి బియ్యం కేజీ రూ.48 వంతున అందజేస్తున్నామన్నారు. అంతే కాకుండా నాణ్యమైన కేజీ కందిపప్పు రూ.135కు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న ఈ సబ్సిడీ సరకులను ప్రజలు అందరూ వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని కోరారు. పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, వీఆర్వో ఆంజనేయులు, హోల్ సేల్ రైస్ మర్చంట్‌లు బొగ్గరప శ్రీనివాసరావు, పరిశ వెంకట నాంచారయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

జంగిల్ క్లియరెన్స్ పనుల పరిశీలన

నిభానుపూడి(పామర్రు): గ్రామాల్లో చెరువు గట్లపై ఉన్న జంగిల్ క్లియరెన్స్ పనులను శనివారం చేపట్టారు. మండల పరిధిలోని నిభానుపూడి చెరువు చుట్టూ ఉన్న ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలను శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ పనులను ఎంపీపీ ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా చెరువు చుట్టూ పేరుకు పోయిన జంగిల్‌ను శుభ్రం చేయటం వలన చెరువులోని నీరు శుభ్రంగా ఉంటాయన్నారు. అనంతరం ఉపాధి కూలీల మస్టర్‌ను ఎంపీపీ పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏపీవో పొలు రాజు, ఫీల్డు అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

మొవ్వ: నకిలీ మందులు అమ్మినా.. అధిక ధరలకు విక్రయించినా.. కృత్రిమ కొరతను సృష్టించినా డీలర్ల పై కఠిన చర్యలు తప్పవని మొవ్వ ఏడీఏ ఎస్. శ్యామల సూచించారు. శనివారం మొవ్వ గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో మొవ్వ, ఘంటసాల మండలాల పరిధిలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం దృష్ట్యా డీలర్లు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, రైతులకు బిల్లులు క్రమంగా ఇవ్వాలని సూచించారు. ఎరువులు, పురుగుల మందుల చట్టాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు కే శివ ప్రసాద్ (మొవ్వ), కే మురళీకృష్ణ (ఘంటసాల), డీలర్లు పాల్గొన్నారు.

అన్నసమారాధన



గుడివాడ టౌన్: పట్టణంలోని వివిధ ఆలయాల్లో శనివారం భారీగా అన్న సమారాధనలు జరిగాయి. శుక్రవారం అమ్మవారిని శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించిన నేపథ్యంలో స్థానిక పెద్దవీధిలో శ్రీ వద్దపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో అన్న సమారాధన చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వల్లూరుపల్లి సుధాకర్, చుండూరి శేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ధనాల వెంకట రత్నారావు-లక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

స్థానిక కొత్తపేటలో శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అన్నసమారాధన చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గ్రంథాలయ అధికారి మృతి



గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయ అధికారిణిగా పనిచేస్తున్న ఇందుపల్లి ఇంద్రాణి జయశ్రీ (61) శనివారం మృతి చెందారు. ఆమెకు భర్త, ఇరువురు కుమారులు ఉన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వేములపల్లి రవికుమార్ ఆమె మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె మృతిపట్ల ప్రథమ శ్రేణి గ్రంథాలయం, శాఖా గ్రంథాలయాల అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

పేదలకు అండగా బీమా

మండవల్లి: పేద ప్రజలకు అండగా పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన కొనసాగుతున్నట్లు స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు పేర్కొన్నారు. మండలంలోని గన్నవరంలో పీఎం జేజేబీవై పథకంలో చేరి మరణించిన వ్యక్తులకు, వారి నామినీలు బొడ్డు కరుణకు రూ.2 లక్షలు, కొమ్మనపల్లి ఏసుకు రూ.2 లక్షల చెక్కులను వైఎస్సార్ సీపీ నాయకుడు గుడివాడ తమ్మిస్వామి, ఎంపీటీసీ ఎం.సాయి దుర్గాభవాని చేతులమీదుగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అందించారు. కొర్లపాడు మాజీ సర్పంచ్ జి.వెంకటేశ్వరరావు, ఎల్ఐసీ ఏబీఎం కిరణ్, జాస్మిన్, పద్మసాయిరోజ, లక్ష్మీప్రసన్న, శివపార్వతి, సునీత పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

మండవల్లి: మండలంలోని సింగనపూడిలో విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టిన సంఘటన శనివారం జరిగింది. ఈ కారణంగా విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ సిబ్బంది వెంటనే కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు.